క్లుప్తంగా

లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో హోమం


హోమం నిర్వహిస్తున్న పండితులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి జన్మ నక్షత్రం స్వాతి, జయంతి సందర్భంగా అభిషేకం, సుదర్శన హోమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ శశిధర్, వేద పండితుడు సముద్రాల నర్సింహాచార్యులు, ప్రధాన అర్చకుడు ధనుంజయ్‌శర్మ, సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో మాతృ దినోత్సవం

నర్సాపూర్: ఆదివారం మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని నర్సాపూర్‌కు చెందిన పలువురు యువకులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వేడుకలు జరిపారు. కేక్ కట్‌చేసి సిబ్బంది, మహిళలకు పంచిపెట్టారు. మాతృ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా నాగేందర్‌రెడ్డి


నియామక పత్రం అందుకుంటున్న నాగేందర్‌రెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండల బీజేపీ అధ్యక్షుడిగా మండలంలోని పోతన్‌శెట్టిపల్లికి చెందిన నాగేందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ ఆదివారం నియామకపత్రం అందజేశారు. మండలంలో ప్రజా సమస్యలపై పోరాడుతూనే పార్టీ అభివృద్ధికి కృషిచేస్తానని నాగేందర్‌రెడ్డి చెప్పారు.

మలుపులు ప్రమాదాలకు పిలుపులు


ప్రమాదకరంగా ఉన్న మూల మలుపు

హవేళిఘణాపూర్(మెదక్): మండల కేంద్రమైన హవేళిఘణాపూర్ నుంచి చౌట్లపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డులో ప్రమాదకర మూలమలుపులు ఉండటం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ప్రమాదకరంగా ఉన్న మలుపుల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడం వల్ల గతంలో ఎన్నో ప్రమాదాలు జరిగి మృత్యువాతపడిన ఘటనలు కూడా ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఇపట్పికైనా మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని పలువురు వాహనాదారులు కోరుతున్నారు.

ఈఏపీసెట్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ


ఎం. లోకేశ్

నర్సాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన ఈఏపీ సెట్ ఫలితాల్లో తమ కాలేజీ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు స్థానిక అల్లూరి సీతరామరాజు గిరిజన గురుకుల కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. తమ కాలేజీకి చెందిన పలువురు విద్యార్థులు ఎంపీసీ విభాగంగా ఎం.లోకేష్ 67.43 మార్కులు సాధించి 7,529 ర్యాంకు సాధించారని తెలిపారు. సాయిరాం 63.2 మార్కులు సాధించి 10.787 ర్యాంకు, ఆనంద్ 61.71 మార్కులు సాధించి 12,310 ర్యాంకు సాధించారని వివరించారు. బైపీసీ విభాగంలో సురేశ్ 63.41 మార్కులు సాధించి 11,864 ర్యాంకు సాధించారని, ఇంకా పలువురు విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారని ఆయన వివరించారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో 1998–99 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు తమతో కలిసి చదువుకున్న మృతుడి కుటుంబానికి అండగా నిలిచి ఆదివారం రూ.55 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పిల్లి మల్లేశం కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో చదువుకున్నాడు. కాగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో అతడు మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఆనాడు తమతో కలిసి చదువుకున్న అతడి కుటుంబానికి తోటి స్నేహితులు ఆర్థిక సాయం అందజేశారు.

చెక్‌డ్యాంలతో జలకళ


అజ్జమర్రి చెక్‌డ్యాంలో జలకళ

మండలానికి నాలుగు మంజూరు

- చిట్కుల్, అజ్జమర్రిలో పూర్తయిన నిర్మాణం
- చండూర్, ఫైజాబాద్‌లలో యాభై శాతం పూర్తి

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని మంజీరా పరివాహక ప్రాంతాలతో పాటు, చుట్టు పక్క గ్రామాల్లో సైతం సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదనే ఉద్దేశంతో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మండలంలో నాలుగు చెక్‌డ్యాంల నిర్మాణాలకు కృషి చేశారు. ముందుగా అజ్జమర్రి, చండూర్ గ్రామాలకు, అనంతరం ఫైజాబాద్, చిట్కుల్ గ్రామాలకు చెక్‌డ్యాంలు మంజూరు చేశారు. వీటి నిర్మాణాలకు రూ. 29.14 కోట్లు మంజూరు చేశారు. అజ్జమర్రి, చిట్కుల్ గ్రామాల్లో చెక్‌డ్యాం నిర్మాణాలు వందశాతం పూర్తి కాగా చండూర్, ఫైజాబాద్‌లో 50 శాతం పూర్తయ్యాయి. ప్రస్తుతం మంజీరా వాగులో నీరు ప్రవహిస్తుండడంతో పనులు ఆగిపోయాయి. పూర్తయిన చెక్‌ డ్యాం నిర్మాణాలతో సుమారు 4 కిలోమీటర్ల మేర నీరు నిల్వ ఉండడంతో పాటు చుట్టూ పక్కల గ్రామాలకు ఏటా రెండు పంటలకు ఢోకా ఉండదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో చెక్ డ్యాంతో పరివాహక ప్రాంతాల్లో సుమారు 2 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది.


మధ్యలోనే నిలిచిపోయిన చండూర్ చెక్ డ్యాం పనులు

సాగుకు సమస్య ఉండదు



చండూర్‌లో చెక్ డ్యాం నిర్మాణం పూర్తయితే రెండు పంటల సాగుకు ఎలాంటి సాగు నీటి సమస్య ఉండదు. అదేవిధంగా నీటి నిల్వ ఉండడంతో చుట్టు పక్కల గ్రామాల్లో సైతం భూగర్భజలాలు పెరిగి బోర్లు సైతం బాగా నడుస్తాయి. ప్రస్తుతం మంజీరా వాగులో నీటి నిల్వ ఉండడంతో ఇబ్బంది లేదు. అధికారులు స్పందించి చెక్ డ్యాం నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి.

– చంద్రశేఖర్‌రెడ్డి, రైతు

త్వరలోనే పూర్తి చేస్తాం



చిలప్‌చెడ్ మండలంలో నాలుగు చెక్ డ్యాంల నిర్మాణాలకు గానూ రెండు గ్రామాల్లో నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో రెండు 50 శాతం పూర్తయ్యాయి. తరచూ సింగూర్ ప్రాజెక్ట్ నీటి విడుదలతో పనులు ఆలస్యమవుతున్నాయి. చండూర్ డ్యాం నిర్మాణం లోతట్టు ప్రాంతం కావడంతో నీటి నిల్వ ఎక్కువగా ఉంటుంది.

– హరీశ్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ, చిలప్‌చెడ్

నల్లపోచమ్మదేవి ఆలయంలో పూజలు


నల్లపోచమ్మదేవికి పూజలు చేస్తున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్ల పోచమ్మదేవి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం దేవాదాయశాఖ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావ్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివ్వప్ప, రాజేశ్, విఘ్నేశ్ శ్రీనల్లపోచమ్మదేవికి పంచామృతాలతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు బోనం చేసి అమ్మవారికి సమర్పించారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

చాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు


అమ్మవారి కుంకుమార్చనలో భక్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించామని ఆలయ అర్చకులు తెలిపారు. ఆదివారం చిలప్‌చెడ్ మండలంలోని చిట్కుల్ శివారులో మంజీరా నది తీరాన వెలసిన శ్రీ చాముండేశ్వరి అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. అనంతరం భక్తులు అమ్మవారికి ప్రదక్షిణలు, ఒడిబియ్యంతో మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు, భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు.

నరసింహ అవతారంలో పల్లకీసేవ



శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి దొంతి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి ఆలయ పూజారి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా నరసింహ అవతారంలో పల్లకీసేవ ఊరేగింపు చేపట్టారు. భక్తులు హారతులు ఇచ్చి పూజలు చేపట్టారు.

లైబ్రరీ భవనం నిర్మించేదెన్నడో?


రంగంపేటలో అద్దె గదిలో కొనసాగుతున్న గ్రంథాలయం

కొల్చారం(నర్సాపూర్): కొల్చారం మండలం రంగంపేటలో శాఖా గ్రంథాలయం సంబంధించి పక్కా భవనం లేకపోవడంతో అద్దె గదిలో కొనసాగుతోంది. గతంలో పాత గ్రామ పంచాయతీ భవనం గ్రంథాలయాన్ని కొనసాగిస్తూ వచ్చారు. ఎనిమిదేళ్ల క్రితం వర్షాలకు అది కాస్తా పూర్తిగా నేల మట్టమైంది. అప్పటినుంచి గ్రంథాలయాన్ని అద్దె గదిలో కొనసాగిస్తూ వస్తున్నారు. గ్రంథాలయం ఉందన్నమాటకే కానీ పాఠకులకు ఉపయుక్తమయ్యే పుస్తకాలు కానీ, గ్రంథాలు కానీ ఇక్కడ ఏ మాత్రం కానరావడం లేదు. గ్రంథాలయంలో వార్తా దిన పత్రికలు మాత్రమే లభ్యమవుతున్నాయి. నూతనంగా గ్రంథాలయ భవన నిర్మాణం కోసం ఇక్కడి గ్రామస్తులు డిమాండ్ చేస్తూ వచ్చారు. అప్పటి ప్రభుత్వ పెద్దలు గ్రామంలో నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి గ్రంథాలయ శాఖ ద్వారా నిధులు మంజూరు చేస్తానని హామీని కూడా ఇచ్చారు. ఎమ్మెల్యే నిధులు సైతం సమకూరుస్తామని తెలిపారు. ఇది గడిచి ఏళ్లు గడుస్తున్నా నూతన భవన నిర్మాణానికి సంబంధించి ఏ మాత్రం అడుగు ముందుకు పడటంలేదు. ఇప్పటికీ భవన నిర్మాణం ఎక్కడ చేపడతారన్నది కూడా గ్రామస్థాయిలో స్థల పరిశీలన చేయకపోవడం శోచనీయం. పాఠకులు మాత్రం వెంటనే నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి సంబంధించి చర్యలు తీసుకోవడంతోపాటు త్వరితగతిన భవనాన్ని అన్ని హంగులతో నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

పోలీసుల విధులకు ఆటంకం

ముగ్గురిపై కేసు నమోదు

కౌడిపల్లి(నర్సాపూర్): పెట్రోలింగ్ నిర్వహిస్తూ విచారణకు వెళ్లిన పోలీసులను తిట్టడంతోపాటు విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఆదివారం ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం శనివారం అర్ధరాత్రి కొట్టాల గ్రామంలో నిర్వహిస్తున్న ఓబరాత్‌లో గొడవ జరుగుతుందని 100 ఫోన్ వచ్చింది. పెట్రోలింగ్‌లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ నరేశ్, డ్రైవర్ లింగం, బ్లూ కోర్ట్ పీసీ శంకరయ్య, పీసీ శ్రావన్‌కుమార్ గ్రామానికి వెళ్లి విచారణ చేస్తున్నారు. అక్కడ గొడవ చేస్తున్న గ్రామానికి చెందిన బాకి కిరణ్, బాకి అబిల్, బాకి సందీప్ ముగ్గురు పోలీసులను ఇక్కడికి ఎందుకు వచ్చారని బూతులు తిడుతూ విధులకు ఆటంకం కలిగించారు. హెడ్‌కానిస్టేబుల్ నరేశ్ పిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

పెద్దశంకరంపేట(మెదక్): ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రజలు ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈజీఎస్ ఏపీఓ సంతోష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇళ్లతోపాటు సామూహిక ఇంకుడు గుంతలు నిర్మించుకోవచ్చని, దీనికి జాబ్ కార్డు కలిగి ఉండాలని సూచించారు. ఇతర వివరాలకు ఈజీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ కార్యవర్గంలో మండల వాసులు

చేగుంట(తూప్రాన్): జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా కార్యవర్గంలో చేగుంట మండల వాసులు చోటు దక్కించుకున్నారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య ఆధ్వర్యంలో మెదక్ జిల్లా కమిటీ సహాయ కార్యదర్శిగా నదీమ్, కార్యనిర్వాహక కార్యదర్శిగా రామ్‌సింగ్, కార్యవర్గ సభ్యులుగా లింగం, కన్నరాందేవాసీ, చేగుంట మండల శాఖ అధ్యక్షుడిగా ఈశ్వర్‌లను నియమిస్తూ నియామక పత్రాలు అందించినట్లు తెలిపారు. సామాన్యుల హక్కుల రక్షణ కోసం నిరంతర పోరాటం చేస్తామని జిల్లా బాధ్యతలు స్వీకరించిన సభ్యులు పేర్కొన్నారు.

మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ

వృథాగా పోతున్న తాగు నీరు


వృథాగా పోతున్న తాగునీరు

అల్లాదుర్గం(మెదక్): వేసవి కాలంలో ప్రజలకు తాగు నీటి ఇబ్బంది లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించినా ఫలితం కనిపించడం లేదు. అల్లాదుర్గం మండలం వెంకట్‌రావ్‌పేట గ్రామ శివారులో మూడు రోజులుగా మిషన్ భగీరథ పైపులైన్ పగిలి నీరు వృథాగా పోతోంది. సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. పైపులైన్ లీకేజీతో కలుషితమైన నీరు సరఫరా అవుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడిపెద్దాపూర్ గ్రామంలో తాగు నీటి ఎద్దడితో ప్రజలు అవస్థలు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎప్పుడు వస్తారో తెలియడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ విచారణ జరిపి విధులు నిర్వహించని అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పైపులైన్ లీకేజీ మరమ్మతులు వెంటనే చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

జోరుగా ధాన్యం కొనుగోళ్లు


జొన్నల వివరాలు నమోదు చేస్తున్న పీఏసీఎస్ సిబ్బంది

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో వరి ధాన్యం, జొన్న కొనుగోళ్లు జోరుగా కొనసాగుతున్నాయి. పెద్దశంకరంపేటలో వరి, జొన్న కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. దీంతో పాటు ఆయా గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేస్తున్నారు. నిరంతరం రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు ధాన్యం రవాణా, కొనుగోలును పరిశీలిస్తూ రైతులకు సూచనలందిస్తున్నారు. జొన్నల కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు గ్రామాల వారీగా టోకెన్లు అందజేసి కొనుగోళ్లు నిర్వహిస్తున్నట్లు పీఏసీఎస్ సీఈఓ రవీందర్ ఆదివారం తెలిపారు.

ఘనంగా మల్లికార్జున స్వామి జాతర


మండల పరిధిలోని గడిపెద్దాపూర్ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. జాతరలో భాగంగా బోనాల పండగ నిర్వహించారు. ప్రజలు భారీగా పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. – అల్లాదుర్గం(మెదక్)

చివరి గింజ వరకూ కొనుగోలు

- 15 లోగా ధాన్యం సేకరణ పూర్తి చేయాలంటున్న అధికారులు
- అధికారుల ప్రకటనతో రైతుల ఆందోళన


రెడ్డిపల్లిలో రైతులు ఆరబోసిన ధాన్యం

చేగుంట(తూప్రాన్): సాధ్యమైనంత త్వరగా ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని ఇటీవల అధికారులు ప్రకటించడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. మండలంలోని పలు గ్రామాల్లో ఈ ఏడు యాసంగి సీజన్‌లో 12,950 ఎకరాల్లో వరి పంట వేశారు. వీరు కాకుండా దాదాపు 550 ఎకరాల్లో రైతులు ప్రైవేటు సీడ్ కంపెనీలకు చెందిన మేల్ ఫీమేల్ ధాన్యం పంటలను వేసుకున్నారు. ఇటీవల తూప్రాన్ ఆర్డీఓ జయ చంద్రారెడ్డి చేగుంట, నార్సింగి మండలాల ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి ఈనెల 15 వరకు ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల కురిసిన వడగండ్ల వానలతో ధాన్యం ఆరబోత ఆలస్యం జరిగింది. కొందరు రైతులు పంటలు ఆలస్యంగా వేసుకోగా వారు ఇటీవలె కోతలను పూర్తి చేశారు. కోతలు పూర్తి చేసిన రైతుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తూకం వేసేందుకు కావాల్సిన తేమ శాతం రావడానికి మూడు రోజుల సమయం పడుతుంది. కాగా, గ్రామాల్లో పలు సాంకేతిక కారణాలతో 25% కొనుగోలు చేయాల్సిన ధాన్యం ఉంటుందని ఆయా గ్రామాల రైతులు పేర్కొంటున్నారు. రైతుల ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని అధికారులు నెల చివరివరకు ధాన్యం కొనుగోలు చేయాలని ఆయా గ్రామాల రైతులు పేర్కొంటున్నారు.

మూడు రోజుల కిందటే కోతలు పూర్తి చేశాం



మూడు రోజుల క్రితమే వరి పంటను కోత కోసి ధాన్యం ఆరబోసాము. తేమశాతం రావడానికి రెండు రోజుల సమయం పడుతుంది. కష్టపడి పంటలను పండిస్తే కొనుగోలు కేంద్రాలు మూసేస్తే ధాన్యం ఎవరికి అమ్ముకుంటాం. ధాన్యం పూర్తయ్యే వరకు కొనుగోలు కేంద్రాలు ఉంచాలి.

–శంభుని భిక్షపతి, రెడ్డిపల్లి

నేడు 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

మిరుదొడ్డి(దుబ్బాక): స్థానిక రైతు వేదికలో అన్నదాతలకు 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి బత్తిని సత్యాన్వేష్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రైతుల ముంగిట్లోకి శాస్త్రవేత్తలను తీసుకురావడం వల్ల రైతులు నూతన సాగువిధానంపై అవగాహన పెంచుకునే అవకాశం ఉందన్నారు. రైతులు ఎదుర్కొటున్న సమస్యలను అడిగి తెలసుకోడమే కాకుండా వ్యవసాయ అనుబంధశాఖల సహకారం ద్వారా శాస్త్రవేత్తలు పరిష్కారాలు, సలహాలు, సూచనలు ఇస్తారని చెప్పారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లిలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం


నిజాంపేటలో 1999-2000 బ్యాచ్ విద్యార్థులు

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో 2010–11 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. తమకు విద్య బోధించిన ఉపాధ్యాయులు (ప్రస్తుతం అల్లాదుర్గం ఎంఈఓ) ధనంయగౌడ్, విజయ్‌కుమార్, నాగయ్య, ప్రవీణ, సుమిత్ర, వీరాజ్‌రెడ్డి, యాదగిరితో పాటు విద్యావాలంటీర్లను సన్మానించి మెమెంటోలను అందించారు. పూర్వ విద్యార్థులు అక్షయ్‌కుమార్, యాదగిరి, శ్రీనివాస్, కుమార్, అనిల్, నవీన్, సంతోషి, మంజుల, మునీరా పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

నిజాంపేట(మెదక్): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999–2000లో పదో తరగతి చదివిన విద్యార్థులు 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.